క్లుప్తంగా

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

ఆకివీడు: ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పని చేస్తుందని సంఘ మండల కార్యదర్శి నేతల ప్రకాష్ బాబు చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సంఘ రికగ్నిజేషన్ పొందిన రోజు సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘ అధ్యక్షుడు జి.చిట్టిబాబు అధ్యక్షత వహించారు. ప్రకాష్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై 2019 నుంచి సంఘం అనేక పోరాటాలు చేసి ఫలితాలు సాధించిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, సంఘ అసోసియేట్ అధ్యక్షులు ఫరూక్, పల్సన్, కోశాధికారి సుందర్‌పాల్, వ్యవసాయాధికారిణి ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

'పది' ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ (పీఎస్ఎం) గరల్స్ హైస్కూల్ విద్యార్థులకు పట్టణానికి చెందిన నాచు ఫణిరాజు ఆర్థిక ప్రోత్సాహకం అందించారు. గత విద్యా సంవత్సరంలో టెన్త్‌లో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన ఏ.నవ్యశ్రీ, బి.దివ్య శ్రీలక్ష్మిలకు ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున నగదు, జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్ఎం వారణాసి రాధాకృష్ణ మాట్లాడుతూ తమ స్కూల్లో టెన్త్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడానికి నగదు బహుమతులు అందిస్తున్నట్లు చెప్పారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



ఉణుదుర్రులో మిషన్‌శక్తి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ యండగండి సెక్టార్ సూపర్‌వైజర్ వి.నిర్మల అన్నారు. శుక్రవారం మండలంలోని ఉణుదుర్రులోని అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ శక్తి వందరోజుల కార్యక్రమంలో భాగంగా బేటీ బచావో- బేటీ పఢావో కార్యక్రమం, పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నిర్మల మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. వీరందరికీ అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా ప్రీ స్కూల్ విద్యను అందిస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బి.రత్నకుమారి, ఏఎన్ఎం వై.సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ఉండి: స్థానిక సెంటర్ నుంచి గణపవరం రోడ్డులోని వెలివర్రు రోడ్డు జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను అధికారులు శుక్రవారం తొలగించారు. రోడ్డుకు ఆనుకొని దుకాణాలు నిర్వహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని వాహనదారుల అభ్యర్థన మేరకు ఆక్రమణలు తొలగించేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం ప్రొక్లెయినర్ సహాయంతో షెడ్లు వంటి వాటిని తొలగించారు. అలాగే శాశ్వత కట్టడాలకు ఆదివారంలోగా తొలగించాలని దుకాణదారులకు తెలిపారు. ఉండి సెంటర్‌లో జాతీయ రహదారిపై పూలకొట్లు, చికెన్ షాపులను తొలగించాలని అధికారులు ఆదేశించారు. పూల దుకాణదారులు ఉండి బస్టాండ్ వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఏర్పాటు చేసుకోవాలని, చికెన్ దుకాణదారులు ఉండి సంత మార్కెట్‌లో ఏర్పాటు చేసిన దుకాణాల్లో వ్యాపారం నిర్వహించుకోవాలని సూచించినట్లు అధికారులు తెలిపారు.

ఎంపీడీవోగా కందుల వాణి

ఆకివీడు: ఎంపీడీవోగా కందుల వాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు ఇక్కడ నుంచి తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారిని తిరిగి వారి స్థానాల్లో విధుల్లో చేరాలని సూచించడంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఏవో శ్రీఖర్, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు.

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

భీమవరం: వన్‌టౌన్‌లోని బుధవారం మార్కెట్ సెంటర్ వద్ద ఉన్న సెల్‌టవర్‌పైకి శుక్రవారం ఓ వ్యక్తి ఎక్కి హల్‌చల్ చేశాడు. చాలాసేపు కిందకు దిగకపోవడంతో పోలీసులు, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. విద్యుత్ సరఫరా కూడా నిలిపివేశారు. అయితే కొంత సమయం తర్వాత ఆ వ్యక్తి కిందకు దిగిరాగా పోలీసులు అతనిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. గతంలో ఇదే వ్యక్తి పలు మార్లు సెల్ టవర్‌పైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. ఈసారి టవర్ ఎందుకు ఎక్కాడో కారణం మాత్రం చెప్పలేదని స్థానికులు చెబుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యల కూత

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని రైల్వే అధికారులు



ప్లాట్‌ఫాంపై బెంచీలు లేని దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ సమస్యల కూత కూస్తోంది. ప్లాట్‌ఫాంపై ప్రయాణికులు కూర్చోవడానికి బెంచీలు పూర్తి స్థాయిలో లేవు. అక్కడక్కడ మాత్రమే అరకొర బెంచీలు ఉన్నాయి. ప్రయాణికులు నిలబడే రైలు కోసం ఎదురు చూస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్‌ఫాం 2, 3 లో ఫ్యాన్లు ఉన్న చోట బెంచీలు లేవు. బెంచీలు ఉన్న చోట ఫ్యాన్లు లేని పరిస్థితి ఈ స్టేషన్‌లో నెలకొంది. కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేదు. ప్లాట్‌ఫాం టిక్కెట్ సైతం వసూలు చేసుకునే రైల్వేశాఖ ప్లాట్‌ఫాంపై కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేకపోతుంది. సమస్యలను రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం వందలాది మంది ఈ స్టేషన్ నుంచి విజయవాడ, రాజమండ్రి, నర్సాపురం, తణుకు, నిడదవోలు ప్రాంతాలకు రైలు ద్వారా ప్రయాణించడానికి వస్తారు. అలాంటి స్టేషన్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడం దారుణం. ప్రజల నుంచి టికెట్ల రూపంలో వచ్చిన రాబడితో ప్రత్యేక రైల్వే బడ్జెట్ ప్రవేశ పెట్టడమే కాకుండా కనీస సౌకర్యాలకు ఖర్చు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జంక్షన్ రైల్వే స్టేషన్‌లో కనీస సౌకర్యాలు లేవు



నేను రోజూ భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ నుంచి తణుకు ప్రయాణం చేస్తాను. ఈ స్టేషన్‌లో పూర్తి స్థాయిలో బెంచీలు లేవు. తాగడానికి మంచినీటి సౌకర్యం సక్రమంగా లేదు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా కాలంగా ఈ సమస్య ఉన్నా రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై తక్షణం అధికారులు స్పందించి, పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలి. — జి.బ్రహ్మజీరావు ప్రయాణికుడు

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

భీమవరం అర్బన్: బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, అలాగే చట్టరీత్యా నేరమని భీమవరం సీడీపీవో టీకేవీ లక్ష్మీకాంతం హెచ్చరించారు. భీమవరం మండలంలోని అనాకోడేరు అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం 100 రోజుల పాటు జరిగే మిషన్ శక్తి పథకంలో భాగంగా బాల్య వివాహాల వలన కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో లక్ష్మీకాంతం మాట్లాడుతూ ఆడవాళ్లకు 18, మగవాళ్లకు 21 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహం చేయాలన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వారిపై దాడులు, అత్యాచారాలు చేసినా చట్టంలో కఠిన శిక్షలు అమలులో ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎం, విద్యార్థినులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో మానసిక వికాసం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

భీమవరం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) మానసిక వికాసానికి దోహదం చేస్తుందని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. కళాశాలలో శుక్రవారం వేదిక్ విజన్ 2024 పేరిట నిర్వహించిన 24 హ్యాకథాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హ్యాకథాన్ కార్యక్రమంలో క్రికెట్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై పూర్తి సమాచారంతో యాప్ రూపొందించిన మూడో సంవత్సరం విద్యార్థులు టి.రాజేష్, ఎన్‌వీ వాసు, టీఎస్ఎన్ మణికంఠ, పి.నికిలేశ్వర్, ఎం.హరీష్, పి.వెంకటరమణ మొదటి స్థానం సాధించగా వారికి రూ.10 వేలు నగదు బహుమతి అందించారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో యోగా, స్పోర్ట్స్, ఫిజియాలజీ రూపొందించి ద్వితీయ బహుమతి పొందిన గ్రంధి హర్షితరాజు, వినాయక, బి.ఉమా వెంకట కార్తీక్, సీహెచ్ రితిన్, కె.లక్షితలకు రూ.6 వేలు, మూడో బహుమతిగా రూ.4వేలు అందించారు. కార్యక్రమానికి ఫిజికల్ డైరెక్టర్ పి.సత్యనారాయణరాజు అధ్యక్షత వహించగా కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, వి.చంద్రశేఖర్, పి.భవాని, సీహెచ్ హరిమోహన్, జి.సారిక, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



మావుళ్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు



పెద్దింటమ్మను దర్శించుకుంటున్న భక్తులు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పూజలను మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మకు వరలక్ష్మీ వత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో మావుళ్లమ్మను దర్శించుకోగా, ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ (చిన్ని) అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. పంచారామ క్షేత్రంలో కొలువైన పార్వతీదేవి, అన్నపూర్ణదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవ స్థానాల కార్య నిర్వహణ అధికారులు, కమిటీ సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

శ్రీ బాలాత్రిపుర సుందరీదేవికి బత్తాయి పళ్లతో అలంకరణ

శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని శ్రీ బాలాత్రిపుర సుందరీదేవికి 300 బత్తాయి పళ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. పట్టణానికి చెందిన కవురు సత్యనారయణ, లీలా వెంకట సత్య రమా దంపతులచే అమ్మవారికి 300 బత్తాయి పళ్ళతో పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు.

భీమవరం అర్బన్: శ్రావణమాసంలోని పౌర్ణమికి ముందుగా వచ్చే శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. భీమవరం మండలం గూట్లపాడు, గొల్లవానితిప్ప, దిరుసుమర్రు, యనమదుర్రు, వెంప, చినఅమిరం, తాడేరు, బేతపూడి, దెయ్యాలతిప్ప, కొత్తపూసలమర్రు, లోసరి తదితర గ్రామాల్లో గ్రామ దేవతలైన కనకదుర్గమ్మ, పర్లమ్మ, వీర్లవెంకమ్మ,మారెమ్మ, గరవళ్లమ్మ అమ్మవార్లకు వరలక్ష్మీ అలంకరణ చేశారు.

ఉండిలో

ఉండి: మండల వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే మొదటి శుక్రవారాన్ని శ్రావణ శుక్రవారంగా ఆచరించి పూజలు చేస్తారని అర్చకులు తెలిపారు. అమ్మవారి పూజ నిమిత్తం కుంకుమార్చనలు నిర్వహించడంతో పాటు అన్ని రకాల ఫలాలను నివేదన చేశారు.

ఆకివీడులో

ఆకివీడు: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా స్థానిక గ్రామ దేవతలు పెద్దింట్లమ్మ, వనువులమ్మను, మాదివాడ గ్రామ దేవత గంగానమ్మ, మద్దిరావమ్మలను భక్తులు దర్శించుకున్నారు.

కాళ్లలో

కాళ్ల: శ్రావణ మాసం సందర్భంగా వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. కోమటికుంటలో వేంచేసియున్న అమ్మవారి ఆలయంలో శ్రావణ మాస శుక్రవారం, వరలక్ష్మి వ్రతం, మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారికి గరగపర్రుకు చెందిన ఉప్పలపాటి శరత్ తేజ, రజని పుణ్య దంపతులచే విశేష కుంకుమార్చన చేశారు. అనంతరం అఖండ అన్నసామారాధన నిర్వహించారు.

వీరవాసరంలో

వీరవాసరం: వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ ఇంటి వద్ద నోములు నోచుకున్నారు. చలిమిడి, వడపప్పు, కుడుములు, ఉండ్రాళ్లు, క్షీరాన్నం, పులిహోర వంటి 9 రకాల వంటలను అమ్మవార్లకు నైవేద్యంగా చెల్లించారు.

దుంపగడపలో వింత జ్వరాలు



దుంపగడప పంచాయతీలో సమీక్ష నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలో వింత జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. జ్వరంతో పాటు కాళ్లు, చేతులు వాచిపోవడం, నడవలేని పరిస్థితి, ముఖంపై నల్లటి మచ్చలు రావడం , ఒళ్లు నొప్పులు వంటివి వస్తున్నాయని పలువురు వ్యాధి గ్రస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైరల్ ఫీవర్ వచ్చిన వెంటనే ఈ రకమైన లక్షణాలు కన్పిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది చేసిన వైద్యం ఫలించలేదని, మండల సీహెచ్‌సీకి వెళ్లినా సరైన స్పందన లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మండల పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యులు రాజశేఖర్‌ను వివరణ కోరగా వైరల్ ఫీవర్ తరువాత ఈ లక్షణాలు కన్పిస్తున్నాయని చెప్పారు. శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ ఆ ప్రాంతానికి వెళ్లి వైద్యం అందిస్తారన్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీ వైద్యులు గ్రామంపై దృష్టి పెట్టామన్నారు. కాగా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ఇటీవల మండలంలోని అజ్జమూరు, ఆకివీడు సీహెచ్‌సీలో పర్యటించి ఇన్‌ఫ్యూయెంజా వచ్చిన రోగులను పరిశీలించారు.

తూతూ మంత్రంగా వైద్యుల పర్యటన

ఆకివీడు: వైరల్‌ఫీవర్‌తో కొట్టుమిట్టాడుతూ కోలుకుంటున్న ప్రజలను ఇతర వ్యాధులు కబళిస్తుంటే వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకుండా సమీక్షలు నిర్వహించడమేమిటని ప్రజలు నిలదీస్తున్నారు. మండలంలోని దుంపగడపలో శుక్రవారం మండల పీహెచ్‌సీ వైద్య బృందం వెళ్లి గ్రామంలో పర్యటించకుండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో, హెల్త్ సెంటర్‌లో సమీక్షలు నిర్వహించి చేతులు దులుపుకున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో వైరల్ ఫీవర్‌పై కార్యక్రమంలో వైద్యాధికారి రమేష్, సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హైస్కూలు విద్యార్థినుల ప్రతిభ

వీరవాసరం: ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్-ఏపీ ఎన్‌జీసీ (నేషనల్ గ్రీన్ కోర్ కమిటీ) జిల్లా స్థాయి పోటీల్లో భాగంగా భీమవరంలో నిర్వహించిన బయోడైవర్సిటీ అనే అంశంపై డిబేట్‌లో జిల్లా స్థాయిలో రాయకుదురు హైస్కూలు విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచారని శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. కైాల ఈశ్వరి తేజిని ద్వితీయ స్థానాన్ని, యండమూరి లీలాకుమారి తృతీయ స్థానాన్ని సాధించారని వారికి స్వాతంత్ర్య దినోత్సవం రోజున కలెక్టరేట్‌లో మంత్రి నిమ్మల, కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా మెమొంటో, ప్రశంసా పత్రాలు అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఎస్సై జి.రాజు సిబ్బందితో కలిసి లోసరిలోని పేకాట శిబిరంపై దాడి చేశారు. దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద రూ.9150 నగదు స్వాధీనం చేసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం: తహసీల్దార్ కార్యాలయ ప్రాంతంలో 33/11 కేవీ ఇండోర్ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11 కేవీ లైన్లపై చెట్లు కొమ్మలు తొలగించుటకు శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. గవర్నమెంట్ హాస్పటల్, సుంకర పద్దయ్య వీధి, రెస్ట్ హౌస్ రోడ్డు, చేపల మార్కెట్ ఏరియా, పీడబ్ల్యూడీ కార్యాలయ ప్రాంతం, 40 అడుగుల రోడ్డు ఏరియా, మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ, శ్రీ కృష్ణ దేవరాయనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కాళ్ల: స్థానిక 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో గల 11 కేవీ లైన్ల చెట్ల కొమ్మలు తొలగించు నిమిత్తం 33/11 కేవీ పెదఅమిరం విద్యుత్ ఉప కేంద్రం మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ ఫీర్ అహ్మద్ ఖాన్ శుక్రవారం తెలిపారు.

దాడి కేసు నమోదు

భీమవరం: దాడి చేసి, కొట్టి గాయపరిచారని ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం టుటౌన్ ఎస్సై రెహమాన్ శుక్రవారం చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలివి. భీమవరం మండలం చినఅమిరం గ్రామానికి చెందిన మన్నె ఆనంద్‌కుమార్ ఈ నెల 15 రాత్రి భీమవరం నుంచి చినఅమిరం మోటారు సైకిల్‌పై వెళుతుండగా అదే గ్రామానికి చెందిన ఉదయకుమార్ అతనిపై దాడి చేసి కొట్టాడు. గాయపడిన ఆనంద్‌కుమార్ చికిత్స కోసం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేరగా, ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రెహమాన్ తెలిపారు.

ప్రాణం పోసే వారి ప్రాణం తీస్తారా..?



స్థానిక ఐఎంఏ హాలులో మాట్లాడుతున్న వైద్యులు

ఆకివీడు: ప్రాణం పోసే దేవుడు లాంటి వైదురాలి ప్రాణం తీస్తారా..ఇంతకంటే దుర్మార్గపు చర్య మరొకటి ఉండదని ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ కలిదిండి మహేష్ వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఐఎంఏ హాలులో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలకత్తాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యపై తీవ్రంగా ఖండించారు. కేసుకు సంబంధించి న్యాయం కోసం వైద్యులు పోరాడతామన్నారు. ఈ నెల 17న వైద్య సేవలు నిలిపి వేసి నిరసన వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సీనియర్ వైద్యులు డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ వైద్య రంగ చరిత్రలో ఇటువంటి దుష్టచర్య చెరగని మచ్చలాంటిదన్నారు. ఐఎంఏ స్టేట్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ ఎండీ బిలాల్ మాట్లాడుతూ వైద్యురాలిపై అమానుష సంఘటన దురదృష్టకరమన్నారు. ఐఎంఏ స్థానిక కోశాధికారి కె.మాధవి మాట్లాడుతూ వైద్యురాలిపై మానవ మృగాలు చేసిన అత్యాచార, హత్యలను ప్రజలు తీవ్రంగా ఖండించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక ఐఎంఏ ప్రతినిధులు ఏఎస్ఎన్.రాజు, శివ రామకృష్ణంరాజు, రామకృష్ణంరాజు, జంపన సుబ్బరాజు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జుత్తిగ నర్సింహమూర్తి

వీరవాసరం: జగనన్న కాలనీల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం వీరవాసరం మండల కమిటీ విజ్ఞప్తి చేసింది. ఆదివారం నౌడూరు జంక్షన్‌లో సీపీఎం కార్యకర్తల విస్తృత సమావేశం అయినంపూడి బాబురావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సీపీఎం జిల్లా సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల ఇచ్చి, కాలనీలను ఏర్పాటు చేసింది. అయితే ఇటీవల ఆ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు పాడయిపోయి అస్తవ్యస్తంగా మారాయి. మత్స్యపూరి పాలెం, ఉత్తర పాలెం, తలతాడితిప్పా కాలనీలో అధికారులు తక్షణం పర్యటించాలన్నారు. అండలూరు, మడుగు పోలవరం గ్రామాల కాలనీల్లో సంబంధిత అధికారులు ఆయా గ్రామాల సర్పంచులు పర్యటించాలని విజ్ఞప్తి చేశారు. వీరవాసరం, పెరికిపాలెం గ్రామాల్లో డ్రైనేజీల మరమ్మతులు చెయ్యకపోవడం పారిశుద్ధ్యం సరిగ్గా లేక పెంట కుప్పలు రోడ్ల పైనే వేయడం వలన దోమలు, ఈగలు, విష సర్పాలు సంచరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మంచినీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. కార్యక్రమంలో యాల్లబండి నారాయణమూర్తి జుత్తిగ శ్రీనివాస్ లింగం సత్యనారాయణ తాళ్లూరు రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామం ఆదర్శంగా ఉండాలి



వెంపలో వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

భీమవరం అర్బన్: దేశవ్యాప్తంగా ప్రతి గ్రామం ఆదర్శంగా ఉండాలని సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. భీమవరం మండలం వెంపలో శుక్రవారం సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ పర్యటించారు. హైస్కూల్, సూపర్ మార్కెట్, సొసైటీ, సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంబై యూనివర్సిటీలో గ్రామాలపై తాను పీహెచ్‌డీ చేస్తున్నానన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఆదర్శ గ్రామాలుగా ఎంపికైన గ్రామాలను సందర్శించి అక్కడ పరిస్థితులను తెలుసుకుని వాటిపై నివేదికను తయారు చేసి యూనివర్సిటీకి, ప్రభుత్వాలకు పంపిస్తామన్నారు. జేడీ లక్ష్మీనారాయణ వెంట అల్లూరి కృష్ణంరాజు, కలిదిండి బంగార్రాజు, కలిదిండి మురళీకృష్ణంరాజు, కె. వాసు, కిట్టు, బాబి తదితరులు ఉన్నారు.

నేడు వైద్య సేవలకు అంతరాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎంఏ నాయకులు

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జేకేఏఆర్ మెడికల్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా 17వ తేదీ వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) నాయకులు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో భీమవరం శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జి.బాలకృష్ణంరాజు, డాక్టర్ ఎస్.శంకర్ కుమార్ వర్మ, సభ్యురాలు డాక్టర్ ఎంవీ స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ అత్యవసర సేవలకు మినహాయింపు ఇచ్చినట్లు తెలిపారు. మృతి చెందిన జూనియర్ డాక్టర్ కుటుంబానికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. డాక్టర్లపై హింసకు వ్యతిరేకంగా రూపొందించిన చట్టాన్ని కేంద్రం పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఆసుపత్రులను సేఫ్ జోన్లుగా ప్రకటించాలన్న డిమాండ్‌తో తాము ఈ ఒక్కరోజు నిరసన ప్రదర్శన చేస్తున్నట్లు వారు స్పష్టం చేశారు. వైద్యులపై దాడులను అరికట్టేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతిభావంతులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లోను మరింత రాణిస్తారని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలం తుందుర్రు సర్పంచ్ ఆరేటి వెంకట సత్య వీరాస్వామి నాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గడిచిన విద్యా సంవత్సరం టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని విద్యకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం, దాతలు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. టెన్త్‌లో ప్రథమ స్థానం సాధించిన బెల్లపు భార్గవికి రూ.10 వేలు, బెల్లపు ఒజస్వికి రూ.6 వేలు, అద్దాల రామ్ చరణ్ తేజకి రూ.4 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఆరేటి కాశీ, మెంటే నాగేశ్వరరావు, కోయ రాంబాబు, కమ్మిల రాము, యర్రంశెట్టి అప్పారావు, ఆరేటి ప్రదీప్, కిషోర్, జితేంద్ర, ప్రధానోపాధ్యాయుడు కేఎస్‌సీహెచ్ సాయిరామ్, జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమవరం డివిజన్

90102 23729

79955 66351

90108 51166

Office mail : tpgadvt@gmail.com